**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

| | |
|---|---|
| తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట | : 99854 38368 |
| చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు | : 99854 10940 |
| పలమనేరు, కుప్పం, పుంగనూరు | : 97036 18724 |
| మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి | : 99854 22298 |
| శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు | : 99890 59755 |


## రేపటి నుంచి 'విద్యాప్రవేశం'

చిత్తూరు (సెంట్రల్), జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో భాగంగా చేపట్టిన విద్యాప్రవేశం కార్యక్రమం సోమవారం నుంచి మొదలు కానుంది. జూలై 25వ తేదీ వరకు నాలుగు వారాల పాటు ఈ కార్యక్రమం సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహించాల్సి ఉంది. కాగా, నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా 13 నుంచి 18వ తేదీ వరకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో జిల్లా వ్యాప్తంగా 42 మంది బడిబయటి పిల్లలను గుర్తించారు. వీరిలో 26 మందిని బడిలో చేర్పించినట్లు సమగ్రశిక్ష అధికారులు తెలిపారు.

## బడిఈడు పిల్లలు బజారులో..



పలమనేరు అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో భిక్షాటన చేస్తున్న పిల్లలు

పలమనేరు, జూన్22 : బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడికి వెళ్లాలని విద్యాశాఖ అధికారులు 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహిస్తుండగా పలమనేరు బజారు వీధిలో పిల్లలు భిక్షాటన చేస్తూ కనిపించడం చర్చనీయాంశంగా మారింది. శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో అంబేడ్కర్ సర్కిల్ సమీపంలో 10 ఏళ్ల పిల్లవాడు మరో చిన్నపిల్లవాణ్ణి చంకన వేసుకుని యాచిస్తూ కనిపించాడు. వివరాలు అడగ్గా తమది కదిరి పట్టణమని చెబుతూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. వీరేకాకుండా పట్టణంలో పలు దుకాణాల్లో, టీ షాపుల్లో పిల్లలు కనిపిస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

## చిత్తూరు కలెక్టర్‌గా సుమిత్‌కుమార్

● కాకినాడకు బదిలీ అయిన షన్మోహన్





సుమిత్‌కుమార్ - షన్మోహన్

చిత్తూరు, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ వస్తున్నారు. ప్రస్తుతం కలెక్టర్‌గా ఉన్న షన్మోహన్ కాకినాడ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటికి చెందిన షన్మోహన్ 2013 ఐఏఎస్ బ్యాచ్ అధికారి. గతేడాది ఏప్రిల్‌లో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కోడ్ రాకముందు వరకు వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్నారనే ముద్ర ఉన్నప్పటికీ, కోడ్ వచ్చాక బ్యాలెన్స్‌గా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఆయన జిల్లాలోనే కొనసాగేందుకు ప్రయత్నించినా ప్రభుత్వం కాకినాడ జిల్లాకు బదిలీ చేసింది. నిజంగా ఈయన ఎన్నికల్లో వైసీపీకి పనిచేసి ఉంటే కూటమి ప్రభుత్వం తదుపరి పోస్టింగ్ కలెక్టర్‌గా ఇచ్చేది కాదని తెలుస్తోంది. జిల్లాకు చెందిన కొందరు టీడీపీ ఎమ్మెల్యేలు ఈయన్ను ఇక్కడే ఉంచుకునేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. తొలిసారి కలెక్టర్ హోదాలో చిత్తూరుకు వచ్చిన షన్మోహన్ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను అనుగుణంగా పనిచేశారు. జిల్లాకు కొత్త కలెక్టర్‌గా రానున్న సుమిత్‌కుమార్ 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. అంతకుముందు అల్లూరి సీతారామరాజు కలెక్టర్‌గా పనిచేశారు. హర్యానా రాష్ట్రం రోహతక్ జిల్లా కోనూర్ గ్రామానికి చెందిన సుమిత్‌కుమార్ ఇంజనీరింగ్ పూర్తయ్యాక నాలుగేళ్ల పాటు ఐటీ ప్రొఫెషనల్‌గా ఉద్యోగం చేశారు.





అన్న క్యాంటీన్‌కు వెల్లవేస్తున్న కార్మికులు - రంగులు దిద్దుకుంటున్న ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్

# కుప్పానికి పూర్వ ప్రాభవం

● సీఎం పర్యటనకు కొనసాగుతున్న ఏర్పాట్లు

కుప్పం, జూన్ 22: కుప్పం పూర్వ వైభవం సంతరించుకుంటోంది. సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఈ నెల 25, 26 తేదీల్లో సీఎం పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా నియోజకవర్గానికి వస్తుండడంతో అటు పార్టీ వర్గాలు, ఇటు ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రజలు తమ కష్టాలు చెప్పుకుని పరిష్కారాలు పొందడానికి, పార్టీ వర్గాలేమో అధినేత ఎదుట పార్టీ పరిస్థితుల గురించి ఏకరువు పెట్టడానికి తయారుగా ఉన్నారు. కాగా సీఎం పర్యటించే ప్రాంతాలను శనివారం కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ మణికంఠ పరిశీలించారు. బహిరంగ సభ ప్రాంగణం, హెలిప్యాడ్, పార్టీ మీటింగ్ జరిగే ప్రాంతం, శాంతిపురం మండలంలో హంద్రీనీవా కాలువను పరిశీలించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కుప్పం డిగ్రీ కళాశాలను పరిశీలించారు.



శాంతిపురంలోని హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

### ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ ఆధునికీకరణ

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్ ఆ పార్టీ అరాచక శక్తులకు నిలయంగా ఉన్నదన్న అపప్రథ మూటగట్టుకుంది. పార్టీ నేతలు, నాయకులు కొందరు ఇక్కడ బస చేసేవారు. అధికారులు ఇటువైపు తొంగి చూసేవారే కాదు.ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో పాడుబడినట్లుగా తయారైన గెస్ట్‌హౌస్‌ను ప్రస్తుతం ఆధునికీకరిస్తున్నారు. చంద్రబాబు ఈనెల 25వ తేదీ రాత్రి ఇక్కడే బస చేయనున్నందున భవనానికి రంగులతో పాటు గదులు, సూట్‌లలోని ఫర్నీచర్, ఇతర వస్తువులను మార్చి సరికొత్తగా వేస్తున్నారు.

### అన్న క్యాంటీన్ ముస్తాబు

చంద్రబాబు పర్యటనలో భాగంగా కుప్పంలో అన్న క్యాంటీన్ ప్రారంభించనున్నారు. పూర్వ తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అన్న క్యాంటీన్ కోసం ప్రత్యేకంగా భవనం నిర్మించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అవి మూతపడ్డాయి. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు ఈనెల 25న కుప్పంలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నారు. ఇందు కోసం భవనాన్ని సిద్ధం చేస్తున్నారు.

## చంద్రబాబు కుప్పం పర్యటన ఇలా..

కుప్పం, జూన్ 22: సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన షెడ్యూల్ దాదాపు ఖరారైంది. 25వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు పీఈఎస్ వైద్య కళాశాల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్‌షోగా బయలుదేరి కుప్పంలో అన్న క్యాంటీన్‌ను మధ్యాహ్నం 1.00-1.30 గంటల మధ్య ప్రారంభిస్తారు. అక్కడి నుంచి బయలుదేరి ఆర్టీసీ బస్టాండు సర్కిల్ చేరుకుని టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్‌కు, అంబేడ్కర్ విగ్రహాలకు అంజలి ఘటిస్తారు. అక్కడే మధ్యాహ్నం 1.30 నుంచి 3.30 గంటల దాకా బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం పీఈఎస్ ఆడిటోరియం చేరుకుని మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30 గంటల దాకా అధికారులతో సమీక్ష జరుపుతారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్‌లో టీడీపీ నియోజకవర్గ, సమన్వయ కమిటీ సభ్యులతో సమావేశమవుతారు. రాత్రి అక్కడే బస చేస్తారు. 26వ తేదీ ఉదయం 10నుంచి 11 గంటల వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు శాంతిపురం జల్లిగానిపల్లె, చిన్నారిదొడ్డి వద్ద హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువను సందర్శిస్తారు. తిరిగి పీఈఎస్ ఆడిటోరియం చేరుకుని మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో సమావేశమై దిశానిర్దేశం చేస్తారు. 4.30 గంటలకు కుప్పం నుంచి హెలికాప్టర్‌లో అమరావతి బయలుదేరి వెళ్తారు.

### ఆందోళన

ప్రభుత్వం మారినా జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో అధికారుల స్థానాల్లో పెద్దగా మార్పు రాలేదు. పాతవారే కొనసాగుతున్నారు. కుప్పం అర్బన్ సీఐ శ్రీధర్ బదిలీ కావడం తప్ప పోలీసు వ్యవస్థలో సైతం అదే అధికారులు కొనసాగుతున్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో జవాబుదారీతనం లేకుండా వైసీపీ అడుగులకు మడుగులు ఒత్తుతూ ఉండిపోయారని విమర్శలు ఎదుర్కొన్న అధికార యంత్రాంగంలో ఇప్పుడు గుబులు నెలకొంది. ముఖ్యమంత్రి సమీక్షలో తమ తప్పులు బయటపడితే శిక్ష తప్పదని ఆందోళన చెందుతున్నారు.

### అధికారుల రోజువారీ పర్యటనలు షురూ

సీఎం పర్యటన నేపథ్యంలో కుప్పంలో అధికారుల హడావుడి ప్రారంభమైంది. కలెక్టర్ షన్మోహన్, ఎస్పీ మణికంఠ మూడు నాలుగు రోజులుగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. శనివారం కూడా వారు కుప్పం చేరుకుని ఏర్పాట్లను పరిశీలించి వెళ్లారు. వారితోపాటు వివిధ విభాగాలకు చెందిన అధికారులు కుప్పానికి క్యూ కడుతూ తమ శాఖలకు సంబంధించి సమీక్షలు చేస్తున్నారు.

## పుంగనూరులో సీన్ రివర్స్

అజ్ఞాతంలోకి వైసీపీ నేతలు

ఎన్నికల ఫలితాల నుంచి స్వస్థలాల్లో కనిపించని వైనం



పుంగనూరు, జూన్ 22: పుంగనూరులో ఎన్నికల ఫలితాల తర్వాత వైసీపీ సీన్ రివర్స్ అయింది. గడిచిన ఐదేళ్ల అధికార బలంతో విచ్చలవిడిగా ప్రత్యర్థులను బెదిరించి, బాధితులపైనే కేసులు పెట్టి దౌర్జన్యాలు, దాడులు యథేచ్ఛగా సాగించారు. ఎన్నికల ఫలితాల తర్వాత గ్రామస్థాయి నుంచి వైసీపీకి వ్యతిరేకంగా పనిచేసినవారు, పోలింగ్ ఏజెంట్లుగా ఉన్నవారి అంతు తేలుద్దామని జాబితా సిద్ధం చేసుకుని హెచ్చరించారు. 'మా పార్టీ అధికారంలోకి వస్తుంది.. పెద్దిరెడ్డి మళ్లీ గెలుస్తారు.. మీకథ తేలుస్తాం' అని చాలామంది టీడీపీ నేతలకు గట్టిగానే వార్నింగ్ ఇస్తూ వచ్చారు. కానీ ఎన్నికల ఫలితాలు రావడం, వైసీపీ తుడిచిపెట్టుకుపోవడంతో సీన్ పూర్తిగా మారిపోయింది. కౌంటింగ్ కేంద్రాల్లో ఉన్న వైసీపీ నేతలు లెక్కింపు పూర్తికాకనే అక్కడి నుంచి జారుకున్నారు. గతంలో అతిగా వ్యవహరించిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. గతంలో తమ చర్యలకు ఎక్కడ ప్రతిఫలం అనుభవించాల్సి వస్తుందోనన్న భయంతో కనిపించకుండా తిరుగుతున్నారు. ఇదే సమయంలో టీడీపీ శ్రేణులు తమను చిత్రహింసలకు గురిచేసిన వారి బాకీ తీర్చేయాలని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల టీడీపీ, జనసేన శ్రేణులు గతంలో ఇబ్బంది పెట్టిన వైసీపీ నేతలపై దౌర్జన్యాలకు దిగుతున్నారు. అదృశ్యమైన నాయకుల కోసం వేచి చూస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరుకు రాకూడదని 'గోబ్యాక్ పెద్దిరెడ్డి' అంటూ నిరసనలు వ్యక్తం చేసిన విషయం విదితమే. పెద్దిరెడ్డినే అడ్డుకునే పరిస్థితిలో తమకు కష్టాలు తప్పవని వైసీపీ శ్రేణులు భయాందోళనకు గురవుతున్నాయి.

### మూడేళ్లుగా కుటుంబాలకు దూరంగా..

పుంగనూరు నియోజకవర్గంలో మూడేళ్లుగా వైసీపీ నేతలు దౌర్జన్యాలు, దాడులు, అక్రమాలు, విధ్వంసాలు, అక్రమ కేసులు ఇలా అనేక దాష్టీకాలకు పాల్పడ్డారు. టీడీపీ నేతలు పార్టీ జెండా పట్టాలన్నా, కార్యక్రమాల్లో పాల్గొనాలన్నా భయంతో వణికిపోయే పరిస్థితి నెలకొంది. ఎన్నికల్లో టీడీపీని పూర్తిగా నిరోధించాలని వ్యూహాత్మకంగా అనుకూల పోలీస్ అధికారుల ద్వారా చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శనను అడ్డుకోవాలని చూశారు. ఈ విషయంలో టీడీపీ శ్రేణులు గట్టిగా పట్టుబట్టడంతో జరిగిన ఘర్షణలో పోలీసులు, టీడీపీ శ్రేణులు గాయపడ్డారు. ఇదే అదనుగా నాటి డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు గంగిరెడ్డి, అశోక్ కుమార్ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో పాటు 498మందిపై హత్యాయత్నం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, విధులకు ఆటంకం తదితర కఠినమైన సెక్షన్లతో 12 కేసులు నమోదు చేశారు. టీడీపీకి గట్టిగా నిలిచే నేతలు, కార్యకర్తలపై కేసులు పెట్టి హింసించారు. గొడవలు, విధ్వంసం చంద్రబాబు ఆదేశాలతోనే చేశామని చెప్పాలని చల్లా రామచంద్రారెడ్డిని డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ రాఘవరెడ్డి బెదిరించినా ఆయన వెనక్కు తగ్గలేదు. ఇలా వైసీపీ ప్రత్యర్థులు 1000మందిపై కేసులు పెట్టి, అరెస్టులు చేసి, వేధించారు. ఈ క్రమంలో వారు ఇళ్లకు దూరంగా అజ్ఞాతంలో కాలం గడపాల్సి వచ్చింది.

## రెచ్చిపోతున్న ఇసుకాసురులు

ప్రభుత్వం మారినా యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు



పోలీసులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

గంగవరం, జూన్ 22 : మండలంలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. రాత్రికి రాత్రి ఇసుక తవ్వడమేగాక పక్క రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కలగటూరు నుంచి కూర్నిపల్లె, గంగవరం, జీడిమాకులపల్లె, క్యాటిల్‌ఫామ్ పరిధిలోని కౌండిన్య నదీ కాలువలో ఇప్పటికే 80 శాతం పైగా ఇసుక గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుకాసురులు మింగేశారు. ప్రభుత్వ మారిన తర్వాత వారం రోజులుగా పోలీసులు వరుస తనిఖీలు చేపడుతుండడం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో పగలు తవ్వకాలు మానేసి, రాత్రి పూట ప్రారంభించారు. ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులు శుక్రవారం రాత్రి జీడిమాకుల పల్లె సమీపంలోని కౌండిన్య నదీకాలువ వద్ద కాపుకాశారు. అక్రమార్కులు టార్చిలైట్ల సహాయంతో ఇసుకను ట్రాక్టర్‌లో లోడింగ్ చేస్తుండగా, రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి గంగవరం పోలీస్‌స్టేషన్‌కు తరలించామని గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.

## గరుడుడిపై గోవిందుడు



తిరుమల క్షేత్రంలో శనివారం పౌర్ణమి గరుడసేవ కన్నుల పండువగా జరిగింది. ప్రత్యేక ఆభరణాలు, పుష్పాలంకరణలో మలయప్ప స్వామిని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి వాహనమండపంలో సిద్ధం చేసిన గరుడ వాహనంపై కొలువుదీర్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ మలయప్ప స్వామి గరుడుడిపై నాలుగు మాడవీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## ద్విచక్ర వాహనాల ఢీ

ఇద్దరి మృతి - మరొకరికి తీవ్ర గాయాలు

నింద్ర. జూన్ 22: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు మృతిచెందిన ఘటన మండలంలోని కొప్పేడు వద్ద శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. శ్రీరాంపురం దళితవాడకు చెందిన ఈశ్వర్(47) పుత్తూరు ఆర్టీసీ డిపోలో ప్రైవేటు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని బైక్‌లో స్వగ్రామానికి బయలుదేరాడు. సాయికృష్ణ(24) మరో వ్యక్తితో కలిసి శ్రీరామపురం నుంచి పాలమంగళానికి బైక్‌లో వెళుతున్నాడు. కొప్పేడు సమీపంలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాల య్యాయి. గాయపడిన వ్యక్తిని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. ఎస్ఐ రామచంద్రయ్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



మృతిచెందిన సాయికృష్ణ, ఈశ్వర్

## కాణిపాక ఆలయంలో అవకతవకలను ప్రక్షాళన చేయండి


చంద్రబాబును ఆశీర్వదిస్తున్న వేద పండితులు

ఐరాల(కాణిపాకం), జూన్ 22: కాణిపాక వరసిద్ధుడి ఆలయంలో వైసీపీ పాలనలో జరిగిన అవకతవకలను ప్రక్షాళన చేయాలని సీఎం చంద్రబాబు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో వెంకటేశులను ఆదేశించారు. విజయవాడలోని సీఎం నివాసంలో శనివారం వారు చంద్రబాబును కలసి వేదాశీర్వాదం కల్పించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ వైసీపీ పాలనలో వరసిద్ధుడి ఆలయంలో అనేక అక్రమాలు జరిగాయన్నారు. వాటిని ప్రక్షాళన చేస్తూ సామాన్య భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## భూమి పట్టా ఇప్పిస్తానని వీఆర్‌ఏ మోసం

### పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

పుంగనూరు రూరల్, జూన్22: భూమి పట్టా ఇప్పిస్తానని ఓ వీఆర్‌ఏ డబ్బు తీసుకుని మోసం చేశాడని ఓ మహిళ పుంగనూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కథనం మేరకు.. మండలంలోని ఏటవాకిలి పంచాయతీ కోళ్లఫారంలో కాపురం ఉన్న బాలాజీ భార్య మంగమ్మకు భూమి పట్టా చేసిస్తానని రామసముద్రం మండలం కేసీపల్లె పంచాయతీకి చెందిన వీఆర్‌ఏ మహ్మద్ నమ్మించాడు. ఆమె నుంచి డబ్బులు తీసుకున్నాడు. భూమి పట్టా ఇవ్వలేదు. దీంతో డబ్బులైనా తిరిగి ఇవ్వాలని నిలదీయడంతో ఆమెపై దాడిచేసి కులంపేరుతో దూషించాడు. ఆమె పోలీసులను ఆశ్రయించింది.

## నిత్యాన్నదానానికి కూ.3 లక్షల విరాళం




ఐరాల(కాణిపాకం), జూన్ 22: కాణిపాక ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తిరుపతికి చెందిన కిశోర్ రెడ్డి శనివారం రూ.3లక్షలు విరాళంగా అందించారు. దాతను ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు స్వాగతించి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందించారు.

## తొమ్మిది మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 22: నైరుతి రుతుపవనాల ప్రభావంతో గడిచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా తొమ్మిది మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. చిత్తూరు అర్బన్‌లో 18.8మి.మీ, కుప్పం 9.2, చిత్తూరు రూరల్ 9.2, గంగాధరనెల్లూరు 9, విజయపురం 6.2, గుడిపాల 5.4, శాంతిపురం 3.6, గుడుపల్లె 3.4, తవణంపల్లెలో 2.2 మి.మీ నమోదైంది.

## తేనెటీగల దాడిలో గాయపడ్డ వృద్ధుడి మృతి


నరసింహారెడ్డి (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, జూన్ 22: తేనెటీగల దాడిలో గాయపడిన తిరుమలయ్యపల్లెకు చెందిన వృద్ధుడు శనివారం చనిపోయాడు. తిరుమలయ్యపల్లెకు సమీపంలో ఈనెల 14వ తేదీన (అక్కగార్లు) గ్రామ దేవతకు పూజలు నిర్వహిస్తుండగా ఎవరో తేనెతుట్టెను కదపడంతో ఈగలు నరసింహారెడ్డి(90)పై దాడి చేశాయి. చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారని గ్రామస్తులు తెలిపారు.

## టీటీడీ విద్యాసంస్థల్లో స్థానికులకు 50 శాతం సీట్లు కేటాయించాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్


మీడియాతో విద్యార్థి సంఘాల నేతలు

తిరుపతి (వైద్యం), జూన్ 22: టీటీడీ విద్యాసంస్థల్లో స్థానిక విద్యార్థులకు 50శాతం సీట్లు కేటాయించాలని భారతీయ దళిత విద్యార్థి సేన అధ్యక్షుడు కొండా యుగంధర్ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నేతలతో కలిసి శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ఇక నిరుపేద విద్యార్థులు కేవలం ప్రభుత్వ బడుల్లో చదువుతారని.. అలాంటి వారికి కార్పొరేట్ పాఠశాలల్లో చదివేవారితో సమానంగా మార్కులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. మెరిట్ ప్రకారం సీట్లు కేటాయిస్తుండటంతో పేద విద్యార్థులంతా ఉన్నత చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ విషయాలపై ఇప్పటికే పలుమార్లు టీటీడీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని చెప్పారు. పైగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న టీటీడీ విద్యాశాఖాధికారికి తక్షణమే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా తగిన చర్యలు తీసుకోకుంటే విద్యార్థి సంఘాలన్నీ ఏకమై టీటీడీ పరిపాలన భవనాన్ని ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థి సంఘాల నేతలు హేమాద్రి యాదవ్, సుధాకర్ మాదిగ, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల నడకమార్గంలో యువతి అదృశ్యం


విద్య (ఫైల్ ఫొటో)

తిరుమల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడకమార్గంలో ఓ యువతి కనిపించకుండా పోయినట్టు తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన హరిబాబు 15 ఏళ్లుగా కుటుంబీకులతో కలిసి అలిపిరి కాలినడమార్గంలోని గాలిగోపురం వద్ద టిఫిన్ అంగడి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో హరిబాబు కుమార్తె విద్య (20) బాత్‌రూమ్‌కు వెళ్లింది. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ఆమెకోసం తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి ఆచూకీ తెలిసిన వారు 0877 2263733 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

## చట్టంలో మార్పులను న్యాయమూర్తులు గుర్తించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీమారావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీమారావు

చిత్తూరు లీగల్, జూన్ 22: న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులను న్యాయమూర్తులు, జ్యుడిషియల్ సిబ్బంది గుర్తించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.బీమారావు కోరారు. జిల్లాలోని జ్యుడిషియల్ అధికారులకు అడ్మినిస్ట్రేషన్, న్యూ క్రిమినల్ లా, వివిధ రకాల అంశాలకు సంబంధించి జడ్పీ సమావేశపు హాలులో రెండు రోజుల వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. జడ్జి మాట్లాడుతూ భారతీయ న్యాయశాఖ చట్టం 2023కు పూర్వం ఇండియన్ పీనల్ కోడ్ 1860 ఉండేదని, ఈ చట్టంలో పలు మార్పులు చేశారని తెలిపారు.శిక్షాకాలంతో పాటు జరిమానా పెంచినట్లు చెప్పారు. వీటిపై జిల్లాలోని న్యాయమూర్తులు, అధికారులు అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం జిల్లా న్యాయమూర్తిని రీసోర్స్ పర్సన్లు సత్కరించి, జ్ఞాపిక అందించారు. ముందుగా వర్క్‌షాపును ఆయన న్యాయమూర్తులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రారంభించారు. ప్రొఫెసర్లు కేవీకే శాంతి, శంకర్, న్యాయమూర్తులు రమేష్, శాంతి, వెన్నెల, శిరీష, శ్రీనివాసులు, వాణిశ్రీ, విజయసారథి రాజు, గురు అరవింద్, రాఘవేంద్ర, ఉమాదేవి, మాధవి, షేక్ బాబ్జాన్, కీర్తన పాల్గొన్నారు.

## వెంకటాపురంలో తగ్గుముఖం పట్టిన అతిసార

### ముమ్మరంగా పారిశుధ్య పనులు - కొనసాగుతున్న వైద్య శిబిరం



వెంకటాపురంలో వైద్య శిబిరం - వెంకటాపురంలో పారిశుధ్య పనులు

గుడుపల్లె, జూన్ 22: మండల పరిధిలోని వెంకటాపురంలో గ్రామంలో అతిసార తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం ఈ గ్రామంలో పలువురు వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. బాధితులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. ఎలాంటి ప్రమాదమూ లేదని వైద్యులు ప్రకటించడంతో శనివారం సాయంత్రం వారు ఇళ్లకు చేరుకున్నారు. శనివారం వెంకటాపురంలో గుడుపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పంచాయతీరాజ్ అధికారులు, సర్పంచ్ నారాయణ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శుద్ధ నీటిని అందించారు. తాగునీటి ట్యాంకును క్లోరినేషన్ చేయించారు.

### ఫుడ్ పాయిజన్‌తో మరో ఇద్దరికి అస్వస్థత

పాలసముద్రం, జూన్ 22: పాలసముద్రంలో ఫుడ్ పాయిజన్‌తో శనివారం మరో ఇద్దరు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. జాతరలో ఫుడ్ పాయిజనై నాలుగు రోజులుగా 150 మందికి పైగా అస్వస్థతకు గురైన విషయం విదితమే. శనివారం మరో ఇద్దరికి జ్వరం, విరేచనాలు కావడంతో పాలసముద్రం ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందారు. దాదాపు అందరి ఆరోగ్యం మెరుగుపడిందని, ఎలాంటి ఇబ్బందీ లేదని డాక్టర్ మోహన్‌కృష్ణ తెలిపారు.

## డయేరియా నివారణలో నిర్లక్ష్యం తగదు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 22: డయేరియా నివారణ విషయంలో నిర్లక్ష్యం తగదని, మెరుగైన వైద్య సేవలను అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖ పనిచేయాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జూలై 1 నుంచి ఆగస్టు 31వ వరకు కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, జడ్పీ సీఈవో గ్లోరియా, డీపీవో లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ పాల్గొన్నారు.

## సీఎం పర్యటనను విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 23: ఈనెల 25, 26 తేదీల్లో కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ షన్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ఎస్పీ మణికంఠతో కలిసి ఆయన అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎలాంటి లోటుపాట్లకూ తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి వెళ్లే రూట్‌మ్యాప్‌లను పక్కాగా సిద్ధం చేయాలన్నారు. శాఖల వారీగా ప్రగతి నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, జిల్లా అధికారులు, ఆర్డీవోలు పాల్గొన్నారు.

## సర్వే చలానా కట్టడానికి వెళితే సచివాలయ సిబ్బంది దాడి చేశారు


విలేకరులతో మాట్లాడుతున్న కౌసల్య

పుంగనూరు, జూన్22: భూమి సర్వే నిమిత్తం చలానా కట్టడానికి వెళితే సచివాలయ అధికారి నిరంజన్‌రెడ్డి దాడి చేశారని మండలంలోని ఏతూరు పంచాయతీ చిన్న నెల్లూరుపల్లె నివాసి కౌసల్య ఆరోపించారు. బాధితురాలి వివరాల మేరకు... చిన్న నెల్లూరుపల్లె నివాసి సీతారామయ్య తన కుమార్తె ధనలక్ష్మికి సర్వే నెంబర్ 248/6లో 0.43సెంట్లు రాసిచ్చాడు. అయితే ఈ భూమి గ్రామానికి చెందిన సుబ్బిరెడ్డికి చెందిందిగా వీఆర్వో రత్నప్ప చెప్పడంతో ఆ స్థలంలో భవన నిర్మాణానికి ప్రయత్నం చేశారు. ధనలక్ష్మికి ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆమె కుమార్తె కౌలస్య కోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్, ఇంజెక్షన్ తీసుకొచ్చింది. తహసీల్దార్‌ను కలసి ఆర్డర్‌ను చూపడంతో సర్వే చేయించుకోవాలని, సచివాలయంలో నగదు చెల్లించాలని సూచించారు. దీంతో కౌసల్య సర్వే చలానా కట్టడానికి వెళితే సచివాలయ ఉద్యోగి నిరంజన్‌రెడ్డి దురుసుగా ప్రవర్తించడంతో పాటు గ్రామానికి చెంది న భార్గవ్‌రెడ్డితో మాట్లాడంటూ బెదిరించాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళితే పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికా రులు స్పందించి న్యాయం చేయాలని కోరింది.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు

తిరుమల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.39 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 72,294 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 31,855 మంది తలనీలాలు సమర్పించారు.

## భక్తజన సంద్రంగా ముక్కంటి ఆలయం


ముక్కంటి ఆలయం వద్ద క్యూలైన్లలో భక్తులు

శ్రీకాళహస్తి, జూన్ 22: శ్రీకాళహస్తీశ్వరాలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సుమా రు 30వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించు కున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇందులో రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,994మంది, రూ.50 టిక్కెట్ల ద్వారా 3,040మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 టిక్కెట్ల ద్వారా 2,879మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,322, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 341మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 315మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 69 మంది భక్తులు రాహుకేతు పూజలు చేయించు కున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,589 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## శాస్త్రోక్తంగా వసంతోత్సవం


దేవదేవుడిపై పసుపు నీళ్ల చల్లుతూ గోవింద నామాలు పఠించారు.

వడమాలపేట, జూన్ 22: అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో శ్రీనివాస కల్యాణమైన మూడవ రోజు సోమవారం శాస్త్రోక్తంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. పద్మావతీ, అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరుడికి పట్టువస్త్రాలు ధరింప జేసి మంగళవాయిద్యాలు, వేద మంత్రాల పఠిస్తూ సూర్యకుమారాచార్యులు, కంకణ భట్టార్ తిప్పయ్య చార్యులు శాస్త్రోక్తంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. పద్మావతీ అండాల్ సమేతంగా నూతన వధూవరు లుగా ప్రసన్న వెంకటేశ్వరుడు మాడ వీధుల్లో విహరిం చారు. అర్చకులు ఉభయ దేవేరులతో

## హనుమంత, గజ వాహనాలపై అభయహస్తాధీశుడి అభయం



హనుమంతు, గజ వాహనాలపై వెంకటేశ్వరుడు

వడమాలపేట, జూన్ 22: అప్ప లాయగుంట ప్రసన్న వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం హనుమంత వాహనం, గజ వాహనాలపై విహారిస్తూ భక్తులకు అభయమి చ్చారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం భక్తుల్లో అగ్రగణ్యుడైన హనుమంతు డిని వాహనంగా చేసుకుని కోదండ రాముడి అలంకరణలో మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. అలసిన ఉభ యనాంచారులతో స్వామివారికి స్నపన తిరుమంజనం గావించారు. రాత్రి గజ వాహనరూడుడైన ప్రసన్న వెంకటేశ్వరుడు మంగళవాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజ నాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.





## గోపూజలో హోంమంత్రి

శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత శనివారం రాత్రి తిరుమలకొచ్చారు. అంతకుముందు అలిపిరిలో సప్తగోప్రదక్షిణ మందిరానికి వెళ్లిన ఆమె వేణుగోపాలస్వామిని దర్శించుకుని గోపూజలో పాల్గొన్నారు. తర్వాత గోవులకు గ్రాసం అందించారు.మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇక్కడ సంప్రదాయబద్ధంగా గోపూజ చేయడం చాలా సంతోషకరమన్నారు.సీఎం చంద్రబాబు సమర్థ నాయకత్వంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి




## నాట్య నీరాజనం

తిరుపతికి చెందిన సిటిజన్ వెల్ఫేర్ ఫోరం, ప్రైడ్ ఇండియా కల్చరల్స్ సంయుక్త నిర్వహణలో శనివారం మహతి కళావేదికలో జరిగిన అయోధ్య రాముడికి నాట్యనీరాజనం కార్యక్రమం కళాభిమానులను అలరించింది.చిన్నారులు మొదలుకుని పెద్దల వరకు నృత్య కళాకారులు జానపద, సంప్రదాయ ప్రదర్శనలిచ్చారు. ఆదివారం కూడా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నాట్యనీరాజనం కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు ఎం.జి. బాలాజి, కోలా వెంకటేశ్వరరావు తెలిపారు.

- తిరుపతి కల్చరల్

## రేణిగుంట- శ్రీకాళహస్తి రైల్వే సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



తిరుపతి(సెంట్రల్), జూన్ 22: రేణిగుంట-శ్రీకాళహస్తి రైల్వే సెక్షన్‌లో శనివారం దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ మేనేజరు (డీఆర్‌ఎం) వినీత్ సింగ్ తనిఖీలు చేశారు. రేణిగుంట నుంచి తిరుమలకు వెళ్లిన ఆయన శ్రీవారి దర్శనానంతరం శ్రీకాళహస్తికి చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌కు వెళ్లి ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక వసతులను పరిశీలించారు. అక్కడ జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎల్‌సీ గేట్ 27 వద్ద ఆగి గేట్‌మెన్ పనితీరును, నిర్వహణను గమనించారు. అలాగే రేణిగుంట రైల్వే స్టేషన్‌లోని యార్డును పరిశీలించి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సూచనలిచ్చారు.

# పలమనేరు
# కుప్పం/పుంగనూరు

## నేడు రామకుప్పంలో కూటమి సమావేశం

రామకుప్పం, జూన్ 22: టీడీపీ కూటమి నేతల మండల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు కోరారు. ఉదయం 10గంటలకు పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆవరణలో జరిగే ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశానికి మండల పరిధిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు తప్పక హాజరుకావాలని కోరారు.

## క్యాంపస్ సెలక్షన్స్‌లో 21 మంది ఎంపిక




పలమనేరు, జూన్22 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులు శుక్రవారం ప్రముఖ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేసులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటేసులు, వైస్ ప్రిన్సిపాల్ జి.ఎం.షన్ముఖం, అధ్యాపకులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, పి.దిలీప్‌కుమార్, ఇతర అధ్యాపకులు శనివారం అభినందించారు. కాగా ఈ ఏడాది మార్చిలో కూడా 280 మంది విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్లలో ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గుర్తుచేశారు.

## షిర్డీ పర్యటనలో మొరం సర్పంచ్ భార్య మృతి


భాగ్యవతి (ఫైల్‌ఫొటో)

పలమనేరు, జూన్22 : పలమనేరు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, మొరం సర్పంచ్ విశ్వ నాథరెడ్డి సతీమణి ఆమూరి భాగ్యవతి (56) గుండెపోటుతో మరణించారు. భాగ్యవతి కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి షిర్డీ సాయిబాబాను దర్శనానికి వెళ్లారు. అక్కడ శుక్రవారం మృతి చెందారు. ఆమె ఆమెభౌతిక కాయాన్ని శనివారం స్వగ్రామమైన మొరం పంచాయితీలోని నక్కపల్లికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకొన్న జడ్పీ ఛైర్మన్ శ్రీని వాసులు ఆమె మృతదేహానికి పూలమాలలు నివాళులు అర్పించారు. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## కుక్కల దాడిలో గొర్రెల మృతి



కుప్పం, జూన్ 22: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని బండశెట్టిపల్లె గ్రామంలో కుక్కల దాడి కారణంగా గురువారం, శుక్రవారం రాత్రివేళల్లో పది గొర్రెలు మృతిచెందాయి. గ్రామంలోని గొర్రెల కాపరి గెండప్ప దొడ్డిలోకి ఒక్కసారిగా చొరబడిన కుక్కలు గొర్రెలను గొంతు కొరికి చంపేశాయి. గ్రామంలో ఇప్పటిదాకా 30 దాకా గొర్రెలు కుక్కల దాడితో మృతి చెందినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులకు స్పందించి కుక్కల బెడదను నివారించాలని కోరుతున్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

గంగవరం, జూన్ 22: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు లయన్ రఘు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కుప్పం పీఈఎస్ వైద్యుల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోపు వచ్చి పరీక్షలు చేసుకోవచ్చని తెలియజేశారు.

## వెంకటేశ్వరుడికి విశేష పూజలు



గుడుపల్లె, జూన్ 22: మండలంలోని యామగానిపల్లె గ్రామంలో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. ఉదయం స్వామి వారిని సుప్రభాతర సేవలో మేల్కొలిపి వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసి సుగంధబరిత పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మధ్యాహ్నం హరిసేవ చేసి భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఉత్సవర్లను పట్టు వస్త్రాలు, ఆభరణాలు రంగు రంగు పుష్పాలతో అలంకరించారు. మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని కర్పూర హారతులు సమర్పించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## సీసీ రోడ్డు మంజూరు చేయించండి



చౌడేపల్లె, జూన్22: చిప్పిలి రామాలయం వద్ద సీసీ రోడ్డు వేయాలని చిప్పిలి గ్రామస్తులు టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డిని కోరారు. శనివారం వారు తెల్లనీళ్లపల్లెలోని ఆయన ఇంటి వద్ద కలిసి విన్నవించారు. త్వరలో మంజూరు చేయిస్తానని ఆయన హామీఇచ్చారు. మునిరాజ, రామ్మూర్తి, రెడ్డెప్ప, వెంకటరమణ, బాబు, శ్రీరాములు, వెంకటప్ప, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చౌడేపల్లె, జూన్22: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండా లని చౌడేపల్లె హైస్కూల్ హెచ్‌ఎం నాగరాజు పేర్కొన్నారు. శనివారం ఆయన హైస్కూల్ విద్యార్థులతో కలసి చౌడేపల్లెలో ర్యాలీ నిర్వహించారు. 14 ఏళ్లలోపు పిల్లలు బడిలోనే ఉండాలని, విద్యార్థులకు విద్యతోనే భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యా సామగ్రి, పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. బడిమానేసిన విద్యార్థులకు బ్రిడ్జి కోర్సులో విద్యనందించనునట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, సుధాకర్, ఈశ్వర్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కల్లూరు, జూన్ 22: పులిచెర్ల మండలం కల్లూరు నాలుగురోడ్ల కూడలిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. కల్లూరు ఎస్‌ఐ రవిప్రకాష్‌రెడ్డి కథనం మేరకు.... పాకాల మండలానికి చెందిన ఉమాపతి (40) ద్విచక్ర వాహనంలో తన భార్య కోకిలతో కలిసి అత్తగారి ఇల్లయిన చల్లావారిపల్లి నుంచి శనివారం స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. మార్గమధ్యంలోని కల్లూరు నాలుగురోడ్ల కూడలి వద్ద కాణిపాకం నుంచి కడప వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఉమాపతికి తీవ్రగాయాలు కాగా భార్య కోకిల స్వల్ప గాయాలతో బయటపడింది. ఉమాపతిని చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఫర్నిచర్ దుకాణంలో దోపిడీ

పుంగనూరు రూరల్, జూన్22: పట్టపగలే పట్టణ నడిబొడ్డున ఓ దుకాణంలో గుర్తు తెలియని దుండగులు నగదు దోపిడీ చేశారు. బాధితుడి కథనం మేరకు.. పట్టణంలోని మదనపల్లె మార్గంలోని మణికంఠ ఫర్నిచర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని దుండగులు ఇద్దరు వెళ్లి రూ.500లకు చిల్లర కావాలని అడిగారు. అతడు లేదని చెప్పాడు. ఆ సమయంలో దుండగులు అతడిపై మత్తుమందు చల్లారు. అతడు వెంటనే కాసేపు స్పృహ కోల్పోయాడు. దుండగులు ఆ సమ యంలో దుకాణంలోని రూ.30వేల నగదుతో పారిపోయాడు. స్పృహలో నుంచి వచ్చాక గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ఇరువర్గాలపై కేసు నమోదు

చౌడేపల్లె, జూన్ 22: యువకుడిపై దాడిచేసిన ఘటనకు సంబంధించి పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని పెద్దకంపల్లెకు (యల్లంపల్లె) చెందిన కోలా లోకేష్(36) మధ్యాహ్నం అదే గ్రామంలో నివాసం ఉన్న గిరినాయుడు ఇంటి ముందు నిలుచుని ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అయితే గిరినాయుడు భార్య సుమ్య అతడిని అనుమానించింది. తన గురించి తన తల్లికి లేనిపోని చాడీలు చెబుతున్నాడని భావించి అతడిని నిలదీసింది. దీనిపై ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవజరిగింది. ఈ క్రమంలో ఆమె తన భర్త గిరినాయుడుకు ఫోన్‌చేసి విషయం తెలియజేసింది. దీంతో అతడు తన స్నేహితులైన పరమేశంతో పాటు మరో వ్యక్తితో కలిసి లోకేష్‌పై దాడి చేశారు. అనంతరం లోకేష్ ఆస్పత్రికి వెళుతుండగా మరోసారి దాడిచేశారు. ఈ దాడిలో లోకేష్ కాలు విరిగింది. లోకేష్, సుమ్య ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

## చెన్నకేశవస్వామికి అభిషేకపూజలు

సోమల, జూన్ 22: సోమల పంచాయతీ చెన్నయ్యగారిపల్లెలో కొలువుదీరిన చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అలంకరణలు చేసి అభిషేకపూజలు నిర్వహించారు. సోమల, కరకమంద, నడింపల్లె, చెన్నయ్యగారిపల్లె తదితర గ్రామాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఆలయాల్లో ఘనంగా పౌర్ణమిపూజలు


విశేషాలంకరణలో శేషాద్రిస్వామి

బైరెడ్డిపల్లె, జూన్ 22 : మండలంలోని కమ్మనపల్లె గ్రామసమీపంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. అర్చకులు మురళీధరాచార్యులు స్వామివారికి అభిషేకంచేసి విశేషాలంకరణతో పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి అనిత, సుబ్రమణ్యం ఉభయదారులుగా వ్యవహరించారు. ● బైరెడ్డిపల్లె పట్టణంలో వున్న శేషాద్రిస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు జరిగాయి. ధనంజయగౌడ ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదానం చేశారు. సల్లాపురెమ్మ ఆలయం, పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.

## పలమనేరులో తాగునీటి పరీక్షలు

పలమనేరు, జూన్22 : పలమనేరులో ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటిని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు శనివారం పరీక్షించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజలు తాగునీరు బాగా మరిగించి చల్లారిన తరువాత తాగాలన్నారు. అంతేగాక ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## టీడీపీ నాయకుడి వార్డు బాట


మురుగు కాలువను పరిశీలిస్తున్న రాజ్‌కుమార్

కుప్పం, జూన్ 22: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 23, 24 వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలను శనివారం తెలుగుదేశం పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పరిశీలించారు. మురుగు కాలువలు, పారిశుధ్య సమస్యలు అధికంగా ఉన్నట్లు స్థానికులు ఆయనకు ఏకరువు పెట్టారు. మున్సిపల్ అధికారులతో చర్చించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాజ్‌కుమార్ వారికి హామీ ఇచ్చారు.

# సమష్టి కృషితోనే కూటమి ఘనవిజయం


మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులును సన్మానిస్తున్న శివరామపురం పంచాయతీ నాయకులు

శాంతిపురం, జూన్ 22: రాష్ట్రంలో కూటమి ఘనవిజయానికి ప్రజల సహకారంతో పాటు కార్యకర్తలు, నేతల కృషే కారణమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు విశ్వనాథంనాయుడు పేర్కొన్నారు. శనివారం శివరామపురం పంచాయతీకి చెందిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్, టీడీపీ మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు ఎంవి సూర్యనాయుడు, టీడీపీ సీనియర్ నేత ఎంఎస్ ప్రకాష్ నాయుడు సహకారంతో పంచాయతీ నాయకులతో కలిసి విశ్వనాథం నాయుడిని ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకటేపల్లె గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి గజమాల వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నంజంపేట, శివరామపురం బూత్‌లలో చంద్రబాబుకు భారీ మెజార్టి తీసుకొచ్చినందుకు కార్యకర్తలకు, నాయకులకు అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ప్రజల మన్ననలు పొందేలా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి నాయుడు, శంకర్, బాలాజీ, బాలక్రిష్ణ, మురుగేష్, సోమశేఖర్, మండల మహిళా అధ్యక్షురాలు శ్యామల, పౌలారాణి, హేమ తదితరులు పాల్గొన్నారు.

## సల్లాపురమ్మకు వైభవంగా రథోత్సవం



గుడుపల్లె, జూన్ 22: కంచుబందార్లపల్లెలో కొలువైన సల్లాపురమ్మ రథోత్సవంపై ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. అగ్నిమారెమ్మ ఆలయం వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వేద పండితులు శాస్త్రోక్తంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆతరువాత అమ్మ వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం సల్లాపురమ్మ ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి రథంపై అధిష్ఠింపజేశారు. మంగళ వాయిద్యాలు, కోలాట నడుమ ఉత్సవాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు పట్టారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీవారు భక్తులకు అన్నదానం చేశారు.

## బాకీ డబ్బులు అడిగినందుకు మహిళపై దాడి


చికిత్స పొందుతున్న విజయలక్ష్మి

కుప్పం రూరల్, జూన్ 22: అప్పు తిరిగి చెల్లించమన్నందుకు ఒక మహిళపై దాడి చేసి గాయపరిచిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. కుప్పం మండలం యామనాశనపల్లి కి చెందిన విజయలక్ష్మి అనే మహిళ శివకుమార్ అనే వ్యక్తికి రూ2 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వమని అడిగితే శివకుమార్ ఆమెపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. ప్రస్తుతం విజయలక్ష్మి కుప్పం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామస్తులు తనకు న్యాయం చేయాలని ఆమె కోరుతోంది.

## మానవహక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ కమిటీ ఏర్పాటు

పలమనేరు, జూన్22 : పలమనేరులో శనివారం మానవహక్కులు అవినీతి నిర్మూలన సంస్థ నూతన కమిటీని ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు డీవీమునిరత్నం, జిల్లా నాయకులు వేలాయుధం పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులుగా డి.సుబ్రమణ్యం, కార్యదర్శిగా టి.మణి, కోశాధికారిగా బి. తిరుమలప్ప, ఉపాధ్యక్షులుగా సాంబ, శివ, అన్నపూర్ణ, భూదేవి, శ్యామల, సహాయకార్యదర్శులుగా కె.దేవా, భూలక్ష్మి, శివ, గంగిరెడ్డి, రెడ్డెప్ప, గౌరవాధ్యక్షులుగా జి.హరిగోవిందు, కో-ఆర్డినేటర్‌గా రవికుమార్, తిప్పన్న, ఆర్గనైజర్లుగా వినోద్ కుమార్, బాలచంద్ర, మునిరత్నం, నరసింహులు వీరితో పాటు 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమం పార్థసారథి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో పలమనేరు, గంగవరం, బైరెడ్డిపల్లి, పెద్దపంజాణి, మండలాలనుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

## వైభవంగా కాశీవిశ్వేశ్వరుడికి పౌర్ణమి పూజలు


అన్నపూర్ణదేవీ, కాశీవిశ్వేశ్వరస్వామి

రామకుప్పం, జూన్ 22: రామకుప్పంలోని అన్నపూర్ణదేవీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. తర్వాత స్వామివారికి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

## వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ



చౌడేపల్లె, జూన్22: విద్యార్థులకు విద్యాసామగ్రిని వాసవి క్లబ్ ఇంటర్‌నేషనల్ అధ్యక్షులు రమిచంద్రన్ పంపిణీ చేశారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో 'డాన్ టు డిస్క్' ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ స్కూల్లో విద్యార్థులకు నోట్ బుక్స్, విద్యా సామగ్రి, భవితా స్కూల్ విద్యార్థులకు బ్లైండ్ స్టిక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమల, క్లబ్ సభ్యులు రామ్‌కుమార్, ఉషారాణి, శ్రీనాథ్, పుష్పలత, లోకేష్, లలిత, వరదరాజులు, బాలాజీ, రమ్య, రమేష్, హెచ్‌ఎం జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు

రొంపిచెర్ల, జూన్22: బొమ్మయ్య గారిపల్లె పంచాయతీలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. చెన్నకేశవస్వామికి, ఆంజనేయ స్వామికి అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. భక్తులకు హరిస్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## పాఠశాలకు బీరువా వితరణ



కల్లూరు, జూన్ 22: పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు శనివారం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో రూ.7000 విలువైన బీరువాను వితరణగా అంద జేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీవాణి, వాసవీక్లబ్ అధికారి పీఆర్ గుప్త, సభ్యులు హేమంత్‌రాజు, నందకుమార్, వినయ్‌కుమార్, ప్రతాప్, ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, ప్రకాష్, రాజేంద్ర పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న బలి బండి ఘట్టం



కల్లూరు, జూన్ 22: పులిచెర్ల మండలం కల్లూరులో కొనసాగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శనివారం మధ్యాహ్నం నిర్వహించిన బలి బండి ఘట్టం అందరినీ అలరించింది. బకాసురుడి వేషధారణలో బలి బండిపై కూర్చొని పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో ఊరేగింపు కొనసాగింది. గ్రామాల్లోని మహిళలు బలిబండికి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహిళలు ఇచ్చిన నైవేద్యంతో మహాభారత యజ్ఞం ప్రాంతానికి చేరుకొని బలి బండి ఘట్టానికి ముగింపు పలికారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


సోమల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో శ్రీరాములు

సోమల, జూన్ 22: నాణ్యమైన విద్య కోసం పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఎంఈవో శివరత్న కోరారు. శనివారం 'నేను బడికి పోతా' కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, విద్యా సామగ్రి అందజేస్తామ న్నారు. ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ● సోమల ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో శ్రీరాములు తనిఖీ చేశారు. బడి ఈడు పిల్లల వివరాలు సేకరించారు. ఆయనవెంట హెచ్‌ఎం. ఎల్లయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

## కందూరు పాలేటమ్మ జాతర

సోమల, జూన్ 22: మండలంలోని కందూరులో కొలువుదీరిన పాలేటమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఆలయాన్ని పచ్చనితోరణాలు, విద్యుత్ లైట్లతో సుందరంగా అలంకరించారు. ఆదివారం ఉదయం 8గంటలకు పొంగుపాలు, అమ్మవారి ఊరేగింపు, సిద్ధపూజ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. రాత్రి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించనున్నారు. సోమవారం ఉదయం బోణాలు, దీలు ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి చెల్లించనున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


పెద్దమల్లెలలో ప్రచారం చేస్తున్న అధికారులు

రొంపిచెర్ల, జూన్22: బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో-1 ఇందిర కోరారు. 'నేను బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దమల్లెల, చిచ్చిలివారిపల్లె పంచాయతీల్లో అవగాహన కల్పించారు. గ్రామాల్లోని పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో చదివే ప్రతి ఒక్కరికీ పథకాలతో పాటు మధ్యాహ్న భోజనం, నాణ్యమైన బోధనలు అందిస్తామన్నారు. చదువుతోనే ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రెడ్డిరమేష్, ఎర్రమరావు, సీఆర్‌పీ కిరణ్ పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడి మృతి


వెంకటప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న రమేష్‌రెడ్డి తదితరులు

చౌడేపల్లె, జూన్ 22: టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటప్ప(75) మృతిచెందాడు. శనివారం మండలంలోని బత్తలాపురంలో ఆయన మృతిచెందాడు. ఆయన మృతదేహానికి టీడీపీ మండ లాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి పూల మాలలువేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు. అంజలి ఘటించిన వారిలో నాయకులు కళ్యాణ్, జయరాం తదితరులు ఉన్నారు.

# పొదుపుతో మహిళా సాధికారత


విద్యార్థులకు ఉపకారవేతనాలు అందిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట, జూన్ 22: మహిళలు క్రమబద్ధంగా పొదుపును పాటించడం ద్వారా మహిళాసాధికారత సాధించవచ్చని చిత్తూరు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని జీఎంఆర్ కళ్యాణ మండపంలో అమ్మాక్స్ 27వ వార్షికోత్సవ మహాసభను సీఈవో దశరథరెడ్డి నేతృత్వంలో నిర్వహించారు. వి.కోటలో 1986లో స్వచ్ఛంద సంస్థగా ప్రారంభమైన అమ్మాక్స్ క్రమేపీ పొదుపు సంస్థగా ఆవిర్భవించి అంచెలంచెలుగా మూడు రాష్ట్రాల పరిధిలో సుమారు 17 వేల మంది సభ్యులతో ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంస్థ ద్వారా ఈ ఏడాది విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరచిన సభ్యుల పిల్లలు 536 మందికి రూ.14.7 లక్షల మేరకు ఉపకారవేతనాలను విశ్రాంత వీసీ ఆచార్య కంకణాల రత్నయ్య చేతుల మీదుగా అందించారు. అలాగే సభ్యులకు సంస్థ తరపున 2023 ఏడాదికిగాను వచ్చిన డివిడెంట్‌ను మహాసభలో జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చేతుల మీదుగా మహిళలకు చెక్కును అందించారు. ఈ సందర్భంగా ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్టు రామ్మూర్తిచే విద్యార్థులకు భవిష్యత్ మీద అవగాహన కల్పిస్తూ ప్రసంగించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఈవో దశరథరెడ్డి, సర్పంచ్ పి.ఎస్.లక్ష్మీ, ఎంఈవో చంద్రశేఖర్, సంస్థ ఛైర్‌పర్సన్ మహిళాకుమారి, కళావతి, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## ఎంపీడీవో కార్యాలయానికి చెత్త బుట్టలు



పలమనేరు, జూన్ 22: సంపద కేంద్రాలకు అనుబంధంగా గ్రామాల్లో ప్రజలు చెత్తను వేరుచేసి తడిచెత్త, పొడి చెత్తలను గ్రీన్ అంబా సిడర్‌లకు అందించేందుకు చెత్త బుట్టలను పలమ నేరుకు పంపించారు. మొత్తం 21,630 చెత్తబుట్టలు మండలం లోని 10 పంచాయితీలకు శనివారం వచ్చాయని ఎంపీడీఓ విద్యాసాగర్ తెలిపారు.

# బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసిన ఎస్పీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

బైరెడ్డిపల్లె, జూన్ 22 : బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌ను శనివారం రాత్రి ఎస్పీ మణికంఠ చందోలు తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, కేసుడైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు, కేసుల దర్యాప్తు ఫైల్స్ పరిశీలించి ఎస్‌ఐ కృష్ణయ్యకు పలు సూచనలిచ్చారు. రోడ్డుప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రాత్రి, పగలు బీట్ల పనితీరును నిరంతరం మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. మహిళాపోలీసులు ఇంటింటికీ వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్‌నేరాలు, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు నియమాలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి సమీక్షించారు.

## వన వేణుగోపాలస్వామికి పాలాభిషేకం



వెదురుకుప్పం, జూన్ 22: వెదురుకుప్పం మండలం దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలో ఉన్న వన వేణుగోపాలస్వామికి శనివారం పాలాభిషేకం నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ 'స్వామి'కి ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరించారు. ఈ క్రమంలో క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు జరిగాయి. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం చేశారు. ప్రధాన కార్య నిర్వాహకులు శివకుమార్, సుబ్రహ్మణ్యంరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించండి

యాదమరి, జూన్ 22: డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని పీఆర్ అండ్‌ఆర్డీ హరిప్రసాద్‌రెడ్డి సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్‌ఎంలకు డయేరియాపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియాను నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ విధిగా గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ అవగాహన సదస్సుల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు.

## తమిళ హీరో విజయ్ జన్మదిన వేడుకలు

చిత్తూరు కల్చరల్, జూన్ 22: తమిళ చలనచిత్ర హీరో దళపతి విజయ్ 50వ జన్మదిన వేడుకలను శనివారం అభిమానులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్ర మనిలా తమిళ వెట్రి కజగం నాయకులు వెంకట్ ఆధ్వర్యంలో నగరంలోని వన్నియార్ బ్లాక్ నగరపాలక ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న బోజనంతోపాటు స్టీల్ లంచ్ బాక్సులను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో శరవణ, సురేష్, లక్ష్మణ్, కంద, లోక, అజర్, మనోహర్, గణేశ్, లోకేష్, త్యాగ, దండపాణి, దినేస్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలిసి జయప్రకాష్



బంగారుపాళ్యం, జూన్ 22: సీఎం చంద్రబాబును అమరావతిలో శనివారం ఎమ్మెల్యే మురళీ మోహన్‌తో కలిసి మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, ఐరాల మండల అధ్యక్షుడు గిరిధర్‌నాయుడు, కాణిపాకం మాజీ చైర్మన్ మణి తదితరులు మర్యాదపూర్వకంగా ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. అభివృద్ధికి సహకరిస్తానని చంద్రబాబు చెప్పినట్లు వారు చెప్పారు.

## చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం



గుడిపాల, జూన్ 22: సీఎంగా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడంతో శనివారం రామభద్రాపురం పంచాయతీలో టీడీపీ నాయకులు వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సచివాలయంలో అమర్చారు. రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల హేమాద్రి నాయుడు, ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్ చౌదరి, మాజీ సర్పంచ్ అమరేంద్రబాబు పాల్గొన్నారు.

## నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సభ్యుల ఎన్నిక



ఎన్.రవి, ఎం.భాస్కర్

పెనుమూరు, జూన్22: నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) మండల కమిటీ సభ్యులను శనివారం పెనుమూరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు, ప్రధాన కార్యదర్శి రామయ్య, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రెడ్డిరమేష్ సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. పెనుమూరు మండల అధ్యక్షుడిగా ఎన్.రవి, గౌరవాధ్యక్షుడిగా కె.దేవరాజులు, ప్రధానకార్యదర్శిగా ఎం.భాస్కర్‌రెడ్డి, సహాధ్యక్షుడిగా ఎన్.పరశురాములు, జిల్లా కౌన్సిలర్‌గా సి.బేబిరాణి, కోశాధికారిగా జి.గీతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ద్రౌపదీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం, జూన్ 22: చవటగుంట ద్రౌపదీ అమ్మవారి మహాభారతం ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వెదురుకుప్పం వైస్ ఎంపీపీ బట్టే రమణసుబ్రహ్మణ్యం ఉభయదారుగా ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు యజ్ఞం చేయించారు. పరిసర గ్రామాల భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## డయేరియా నిర్మూలనకు టాస్క్ పోర్స్ టీం ఏర్పాటు

చిత్తూరు రూరల్, జూన్ 22: జిల్లాలో వర్షాలు కారణంగా నీరు కలుషితమై అనేక ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదవుతున్నాయని, వీటి నిర్మూలన కోసం జిల్లా రాపిడ్ రెస్పాన్స్ టీం, టాస్క్ పోర్స్ టీం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తెలిపారు. శనివారం వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైతే డయేరియా కేసులు ఉన్నా, అనుమానం వచ్చినా వెంటనే ఈ టీంలు ఆయా గ్రామాలకు చేరుకొని మెడికల్ క్యాంపు నిర్వహిస్తాయన్నారు. ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు గ్రామాల్లో పర్యటించి డయేరియా రాకుండా జాగ్రతలపై అవగాహన కల్పించాలన్నారు. ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## 'బడికి పోదాం'పై అవగాహన ర్యాలీ



నగరి జూన్ 22: ఆదివారం జరిగే బడికి పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నగరి పెరుమాళ్‌గుడి వీధిలో విద్యార్థులు, రాజకీయ నాయకులు శనివారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. బడి ఈడు పిల్లలందరు బడిలో వుండేలా విద్యార్థులను, వారి తలిదండ్రులను ప్రోత్సహించాలని ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయ పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్, కమిటీ అధ్యక్షురాలు మీన, నాయకులు ఇంద్రయ్య, గుణశేఖర్, జ్యోతినాయుడు, కుప్పయ్య, సోము, గోపి, మణి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీచేసిన ఎస్పీ

బైరెడ్డిపల్లె, జూన్ 22 : బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌ను శనివారం రాత్రి ఎస్పీ మణికంఠ చందోలు తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, కేసుడైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పెండింగ్ కేసులు, వాటి స్థితిగతులు, దర్యాప్తు ఫైల్స్ పరిశీలించి ఎస్ఐ కృష్ణయ్యకు పలు సూచనలిచ్చారు. రోడ్డుప్రమాదాల నియంత్రణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు.మహిళాపోలీసులు ఇంటింటికీ వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్‌నేరాలు, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు.

## నేడు దుర్యోధన వధ

పాలసముద్రం, జూన్ 22: మండలంలోని కృష్ణాజిమ్మాపురంలో ఉన్న ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారతంలో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటలకు దుర్యోధన వధ, సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందని ఆలయ ధర్మకర్త బాలయ్య నాయుడు తెలిపారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

## నేడు గంగమ్మకు మరు పూజలు

చిత్తూరు కల్చరల్, జూన్ 22: నగరపాలక పరిధి న్యూ ప్రశాంత్ నగర్ కాలనీలోని నడి గంగజాతర మహోత్సవాలు ఇటీవల వైభవంగా జరిగాయి. అందులో భాగంగా ఆదివారం అమ్మవారికి శాంతి అభిషేకం, మరు పూజలు నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు జమునా రమేష్ తెలిపారు.

## నేడు రక్తదాన శిబిరం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 22: గిరింపేట స్టేట్ బ్యాంకులో ఆదివారం ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక నాయకుడు దివంగత తారకనాథ్ 20వ వర్ధంతి నిర్వహిస్తున్నట్లు ఎస్బీఐ ఉద్యోగుల సంక్షేమ సంఘం సెక్రటరీ శ్రీహరి, జీసాన్ బాషా, రాజేష్, రవిలు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు ఉద్యోగులు రక్తదానం చేయనున్నారని, ఆసక్తి గలవారు రక్తదాన శిబిరంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## స్పీకర్‌గా అయ్యన్న ఏకగ్రీవంపై హర్షం

పెనుమూరు, జూన్22: శాసన సభాపతిగా సీనియర్ టీడీపీ నాయకుడు అయ్యన్నపాత్రుడిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై మండల టీడీపీ అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు హర్షం వ్యక్తం చేశారు. అలాగే గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడంపై కూడా ఆయన హర్షం వ్యక్తం చేశారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఏర్పాటు అయ్యాక ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా థామస్ గెలవడం ఇదే తొలిసారని ఆయన తెలిపారు.

## డీలర్ షాపును మంజూరు చేయండి

గుడిపాల, జూన్22: పార్టీకి కష్టపడి పనిచేసిన వారికి న్యాయం చేయాలని గట్రాళ్లమిట్ట గ్రామస్తులు కోరారు. శనివారం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ఆధ్వర్యంలో దళితులు పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడును కలిసి గ్రామంలో అర్హులైన వారికి రేషన్‌షాపు బాధ్యతను అప్పగించాలని కోరారు.

## కలుపు నివారణ పరికరాల పంపిణీ

పూతలపట్టు, జూన్22: పోలవరం పంచాయతీ క్షీరసాగరంలో 30మంది గిరిజన రైతులకు శనివారం పంట పొలాల్లో కలుపు నివారణకు ఉపయోగపడే పరికరాలను ఆచార్య ఎన్‌జీ. రంగా వ్యవసాయ కళాశాల అధికారులు ఉచితంగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం రైతులకు పరికరాల వాడకంపై కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ఎంవీ రమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ రూపేష్ కుమార్‌రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీమతి ఉమ, మండల వ్యవసాయ అధికారి మధురవాణి తదితరులు పాల్గొన్నారు.

## చోరీపై ఆలయ ఈవో స్పందనేదీ ?

కార్వేటినగరం, జూన్ 22: కార్వేటినగరం స్కంద పుష్కరిణి పక్కనే సుబ్రమణ్యశ్వర స్వామి ఆలయంలో గురువారం రాత్రి దొంగలు ఆలయంలోకి ప్రవేశించి బంగారు, వెండి పట్టు వస్త్రాలు చోరీ చేసినా ఆలయ ఈవో ఇంతవరకు స్పందించక పోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. చోరీ గురించి ఆలయ ఈవో ఇంతవరకు ఎందుకు స్పందించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆలయంలో చోరీ జరిగిన సంఘటన భద్రత వైఫల్యాన్ని స్పష్టంగా చెబుతున్నదని భక్తులు అంటున్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

గంగవరం, జూన్ 22: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు లయన్ రఘు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కుప్పం పీఈఎస్ వైద్యుల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోపు వచ్చి పరీక్షలు చేసుకోవచ్చని తెలియజేశారు.

## కుక్కల దాడిలో గొర్రెలు మృతి

కుప్పం, జూన్ 22: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని బండశెట్టిపల్లె గ్రామంలో కుక్కల దాడి కారణంగా గురువారం, శుక్రవారం రాత్రివేళల్లో పది గొర్రెలు మృతి చెందాయి. గ్రామంలోని గొర్రెల కాపరి గెండప్ప దొడ్డిలోకి ఒక్కసారిగా చొరబడిన కుక్కలు గొర్రెలను గొంతు కొరికి చంపేశాయి. గ్రామంలో ఇప్పటిదాకా 30 దాకా గొర్రెలు కుక్కల దాడితో మృతి చెందినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులకు స్పందించి కుక్కల బెడదను నివారించాలని కోరుతున్నారు.

## ఆకట్టుకున్న బలి బండి ఘట్టం



కల్లూరు, జూన్ 22: పులిచెర్ల మండలం కల్లూరులో కొనసాగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా శనివారం మధ్యాహ్నం నిర్వహించిన బలి బండి ఘట్టం అందరినీ అలరించింది. బకాసురుడి వేషధారణలో బలి బండిపై కూర్చొని పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో ఊరేగింపు కొనసాగింది. గ్రామా ల్లోని మహిళలు బలిబండికి నైవేద్యం సమర్పించారు. అనంతరం మహిళలు ఇచ్చిన నైవేద్యంతో మహాభారత యజ్ఞం ప్రాంతానికి చేరుకొని బలి బండి ఘట్టానికి ముగింపు పలికారు.

## ఇరువర్గాలపై కేసు నమోదు

చౌడేపల్లె, జూన్ 22: యువకుడిపై దాడిచేసిన ఘటనకు సంబంధించి పోలీసులు ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని పెద్దకంపల్లెకు (యల్లంపల్లె) చెందిన కోలా లోకేష్(36) మధ్యాహ్నం అదే గ్రామంలో నివాసం ఉన్న గిరినాయుడు ఇంటి ముందు నిలుచుని ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అయితే గిరినాయుడు భార్య సుమ్మ అతడిని అనుమానించింది. తన గురించి తన తల్లికి లేనిపోని చాడీలు చెబుతున్నాడని భావించి అతడిని నిలదీసింది. దీనిపై ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవజరిగింది. ఈ క్రమంలో ఆమె తన భర్త గిరినాయుడుకు ఫోన్‌చేసి విష యం తెలియజేసింది. దీంతో అతడు తన స్నేహితులైన పరమేశంతో పాటు మరో వ్యక్తితో కలిసి లోకేష్‌పై దాడి చేశారు. అనంతరం లోకేష్ ఆస్పత్రికి వెళుతుండగా మరోసారి దాడిచేశారు. ఈ దాడిలో లోకేష్ కాలు విరిగింది. లోకేష్, సుమ్మ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

# లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

● మున్సిపల్ కమిషనర్ అరుణ

చిత్తూరు, జూన్ 22: నగరపాలక సంస్థ పరిధిలోని కూడళ్లు, డ్రైన్లు, లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ అరుణ చెప్పారు. శనివారం ఆమె నగరంలోని ప్రధాన కూడళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మురుగునీటి కాల్వల్లో పూడికతీత పనులను పక్కాగా చేపట్టాలన్నారు. వర్షపు నీటిలో ప్రజలు ఎక్కడా ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. కల్వర్టులు, డ్రైనేజీ, లోతట్టుప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ప్రధానంగా నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేయడం, నిర్దేశించిన సమయంలో స్ప్రేయింగ్ చేయాలన్నారు. ప్రధానంగా ఇంటి నుంచి చెత్త సేకరణ విధిగా చేయాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులతోమాట్లాడుతున్న కమిషనర్ అరుణ

# సభాసంప్రదాయాలకు వైసీపీ ఎమ్మెల్యేలు తిలోదకాలు : టీడీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూన్22: శాసన సభ సంప్రదాయాలను వైసీపీ ఎమ్మెల్యేలు అగౌరవపరిచారని టీడీపీ నేతలు అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ స్పీకర్ ఎన్నిక సందర్భంగా విపక్ష సభ్యులు కూడా సభలో ఉండి ఎన్నికల్లో పాల్గొని సభాపతిని తన సీటు వరకు తీసుకొనివెళ్ళి సీట్లో కూర్చోబెట్టాల్సిన సంప్రదాయం శాసన సభలో ఉందని చెప్పారు. కానీ శాసనసభ సమావేశానికి మాజీ సీఎం జగన్‌తోపాటు వైసీపీ ఎమ్మెల్యేలు ఎవరూ హాజరుకాకపోవడం సభను అగౌరవపరచడమేనని పేర్కొన్నారు. అంతేకాక రాష్ట్ర ప్రజలను, బీసీలను అవమానించినట్లేనని అన్నారు. అలాగే రాష్ట్రంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా నిర్మించిన వైసీపీ కార్యాలయాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, నేతలు మోహన్‌రాజ్, త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కల్యాణం

గుడిపాల, జూన్ 22: మండలంలోని ఏఎల్ పురంలో శనివారం సీతారామ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ సుబ్బానాయుడు, అతని కుమారుడు రమేష్, మాధవి, కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించి సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పురోహితులైన మహేష్‌శర్మ, సుదర్శన్‌లు హోమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు పసుపుదారాలను అందించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీఎం ట్రస్టు నిర్వాహకులు చెన్నకేశవులునాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయుడులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుర్వప్పనాయుడు, మాజీ ఎంపీటీసీ సాంబశివనాయుడు, గోపి, రెడ్డెప్ప, శివలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీతారాముల కళ్యాణోత్సవంలో పాల్గొన్న టీడీపీ నేతలు

# తూనికలు, కొలతల కార్యాలయానికి తాళం

● ఫోన్ చేసినా స్పందించని అధికారులు

చిత్తూరు సిటీ, జూన్ 22: ప్రభుత్వం మారినా కొంతమంది అధికారుల తీరు మారడంలేదు. ప్రజాధనాన్ని వేతనాలుగా తీసుకుంటూ కొంతమంది అధికారులు కర్తవ్యం, జవాబుదారీ తనం లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ పనిరోజుల్లో కూడా కార్యాలయానికి తాళాలువేసి, కనీసం ఫోన్‌లో కూడా అందుబాటులోకి రావడంలేదు. దీంతో సంబంధిత కార్యాలయానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తూనికలు, కొలతల కార్యాలయానికి తాళాలు వేశారు. ఫోన్ చేసినా సంబంధిత అధికారులు స్పందించకపోవడమే ఇందుకు నిదర్శనం. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయానికి తాళాలు వేసివుండటంతో వివరాలు అడిగి తెలుసుకునేందుకు ఫోన్‌ద్వారా ప్రయత్నించడం జరిగింది. కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సమాచార హక్కుచట్టం బోర్డులో డిప్యూటీ కంట్రోలర్, అసిస్టెంట్ కంట్రోలర్, ఇన్స్‌పెక్టర్ పేర్లు, వారి ఫోన్ నెంబర్లు ఉన్నాయి. ఇందులో అందరికీ ఫోన్లు చేసినా ఎవరూ స్పందించలేదు. ఇలాంటి కార్యాలయం, అధికారులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.




తాళం వేసిఉన్న తూనికలు, కొలతల కార్యాలయం

## సమష్టి కృషితోనే కూటమి ఘన విజయం



గౌనివారి శ్రీనివాసులను సన్మానిస్తున్నశివరామపురం నాయకులు

శాంతిపురం, జూన్ 22: రాష్ట్రంలో కూటమి ఘనవిజయానికి ప్రజల సహకారంతో పాటు కార్యకర్తలు, నేతల కృషే కారణమని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు విశ్వనాథంనాయుడు పేర్కొన్నారు. శనివారం శివరామపురం పంచాయతీకి చెందిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు శేఖర్, టీడీపీ మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు ఎంవి సూర్య నాయుడు, టీడీపీ సీనియర్ నేత ఎంఎస్ ప్రకాష్ నాయుడు సహకారంతో పంచాయతీ నాయకులతో కలిసి విశ్వనాథం నాయుడిని ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకటేపల్లె గ్రామంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి గజమాల వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నంజంపేట, శివరామపురం బూత్‌లలో చంద్రబాబుకు భారీ మెజార్టీ తీసుకొచ్చినందుకు కార్యకర్తలకు, నాయకులకు అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ప్రజల మన్ననలు పొందేలా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి నాయుడు, శంకర్, బాలాజీ, బాలక్రిష్ణ, మురుగేష్, సోమశేఖర్, మండల మహిళా అధ్యక్షురాలు శ్యామల, పౌలారాణి, హేమ తదితరులు పాల్గొన్నారు.

## సల్లాపురమ్మకు వైభవంగా రథోత్సవం



గుడుపల్లె, జూన్ 22: కంచుబందార్లపల్లెలో కొలువైన సల్లాపురమ్మ రథోత్సవంపై ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. అగ్ని మారెమ్మ ఆలయం వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వేద పండితులు శాస్త్రోక్తంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆ తరువాత అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం సల్లాపురమ్మ ఉత్సవ విగ్ర హాన్ని పట్టువస్త్రాలు, పూల హారాలతో అలంకరించి రథంపై అధిష్టింపజేశారు. మంగళ వాయిద్యాలు, కోలాట నడుమ ఉత్సవాన్ని గ్రామంలో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూర హారతులు పట్టారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీవారు భక్తులకు అన్నదానం చేశారు.

## పలమనేరులో తాగునీటి పరీక్షలు

పలమనేరు, జూన్22 : పలమనేరులో ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటిని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు శనివారం పరీక్షించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజలు తాగునీరు బాగా మరిగించి చల్లారిన తరువాత తాగాలన్నారు. అంతేగాక ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న కోదండయ్య

నగరి,జూన్22: అంగన్‌వాడీల సమ్మెకాలంలో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను రాష్ట్రంలో కొత్తగా వచ్చిన ప్రభుత్వం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శనివారం నగరిలో జరిగిన అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమావేశంలో ప్రసంగిస్తూ గతంలో 42 రోజులపాటు జరిగిన సమ్మెలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అంగన్‌వాడీ కార్యకర్తల, హెల్పర్ల జీతాలు పెంచాలని వారు కోరారు. అంగన్‌వాడీ పిల్లలకు యూనిఫామ్ ఇవ్వాలని, నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చూడాలని కోరారు.

## బాకీ డబ్బులు అడిగినందుకు మహిళపై దాడి

కుప్పం రూరల్, జూన్ 22: అప్పు తిరిగి చెల్లించ మన్నందుకు ఒక మహిళపై దాడి చేసి గాయపరిచిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. కుప్పం మండలం యామనాశనపల్లి కి చెందిన విజయలక్ష్మి అనే మహిళ శివకుమార్ అనే వ్యక్తికి రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఇచ్చిన డబ్బును తిరిగి ఇవ్వమని అడిగితే శివకుమార్ ఆమెపై కత్తితో దాడిచేసి గాయ పరిచాడు. ప్రస్తుతం విజయలక్ష్మి కుప్పం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామస్తులు తనకు న్యాయం చేయాలని ఆమె కోరుతోంది.

## మానవహక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ కమిటీ ఏర్పాటు

పలమనేరు, జూన్22 : పలమనేరులో శనివారం మానవహక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ నూతన కమిటీని ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు డీవీముని రత్నం, జిల్లా నాయకులు వేలాయుధం పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షులుగా డి.సుబ్రమణ్యం, కార్యదర్శిగా టి.మణి, కోశాధికారిగా బి. తిరుమలప్ప, ఉపాధ్యక్షులుగా సాంబ, శివ, అన్నపూర్ణ, భూదేవి, శ్యామల, సహాయకార్యదర్శులుగా కె.దేవా, భూలక్ష్మి, శివ, గంగిరెడ్డి, రెడ్డెప్ప, గౌరవాధ్యక్షులుగా జి.హరిగోవిందు, కో-ఆర్డినేటర్‌గా రవికుమార్, తిప్పన్న, ఆర్గనైజర్లుగా వినోద్ కుమార్, బాలచంద్ర, మునిరత్నం, నరసింహులు వీరితో పాటు 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకొన్నారు. కార్యక్రమం పార్థసారథి అధ్యక్షతన జరిగింది.

## క్యాంపస్ సెలెక్షన్స్‌లో 21 మంది ఎంపిక



పలమనేరు, జూన్22 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులు శుక్రవారం ప్రముఖ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్‌లో ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేసులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటేసులు, వైస్ ప్రిన్సిపాల్ జి.ఎం.షన్ముఖం, అధ్యాపకులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, పి.దిలీప్‌కుమార్, ఇతర అధ్యాపకులు శనివారం అభినందించారు. కాగా ఈ ఏడాది మార్చిలో కూడా 280 మంది విద్యార్థులు క్యాంపస్ సెలెక్షన్లలో ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గుర్తుచేశారు.